విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 సంచిక :75 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ బుధవారం 5 ఆగస్టు 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## సరిహద్దులో చైనా శతఘ్నులను మోహరించిన పాకిస్థాన్..

- భారత్ గట్టి వార్నింగ్
- సరిహద్దులో 250 చైనా తయారీ శతఘ్నులను మోహరించిన పాకిస్థాన్
- జాతీయ ప్రయోజనాల కోసం ఏం చేయడానికైనా సిద్ధమని స్పష్టం చేసిన భారత్
- గతంలో 'ఆపరేషన్ సిందూర్'లో గట్టి బుద్ధి చెప్పామని గుర్తుచేసిన విదేశాంగ శాఖ




## సభ సజావుగా సాగేందుకు మోదీ, షా సభకు రావాలన్నదే తమ డిమాండ్

- ఆ సమస్యలపై సమాధానాలు దాటవేస్తూ మోదీ, షా పార్లమెంటును అవమానిస్తున్నారు
- వాస్తవాలు వెలుగులోకి రావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ రెండు అంశాలపై చర్చ జరగాలని ఖర్గే డిమాండ్
- "ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన విషయం

# రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా

- పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల
- 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచింది
- భయంకర పరిస్థితులు, ఒక విప్లవం కారణంగా 57శాతం ఓట్లు వచ్చాయి
- రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ



**అమరావతి**

రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు. ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు

వివరాలు 2లో..



## దేశంలోనే తొలిసారి 'ఏఐ' ఇంటర్వ్యూలు

- నిరుద్యోగులకు వరం 'నైపుణ్యం' పోర్టల్
- నిరుద్యోగ యువత, విద్యార్థుల కోసం ప్రభుత్వ సరికొత్త అడుగు
- 'నైపుణ్యం' పోర్టల్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటర్వ్యూలు
- తొలి విడతలో 20 లక్షల మందికి అవకాశం

**అమరావతి**

రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం సరికొత్త విప్లవానికి నాంది పలికింది. ఉద్యోగ వేటలో ఉన్న యువత తమ వృత్తిపరమైన సామర్థ్యాలను, నైపుణ్యాలను పక్కాగా అంచనా వేసుకునేందుకు వీలుగా 'నైపుణ్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో దేశంలోనే తొలిసారిగా 'ఏఐ ఇంటర్వ్యూ' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని ద్వారా యువత తమ ప్రతిభను పరీక్షించుకోవడంతో పాటు, లోపాలను సరిదిద్దుకుని

వివరాలు 2లో..

## ఆపరేషన్ త్రిశూల్

- 36 దేశాల నుంచి 274 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం
- రూ. 17874 కోట్ల ఆస్తులు జప్తు!
- 2019 నుంచి 2026 వరకు డేటా విడుదల చేసిన హోం శాఖ
- రూ. 17,874 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్
- హత్యలు, అత్యాచారాలు పోక్సో చట్టం కింద నేరాలకు పాల్పడిన వారు కూడా ఉన్నారు




## ఆలస్యం చేస్తే చాలా కష్టం..

- జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్
- పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!
- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం






## ఆ వాహనాలకు నో పెట్రోల్

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఇన్సూరెన్స్ లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరగడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ఆదేశం

# రాష్ట్రంలో ఐదు చోట్ల సీఐఐ ప్రాంతీయ సదస్సులు

- నిర్వహణకు కమిటీల ఏర్పాటు
- నవంబర్ 12,13 తేదీల్లో విశాఖలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సదస్సు
- అక్టోబర్‌లో ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం




**అమరావతి**

ఈ ఏడాది నవంబర్ 12,13 తేదీల్లో విశాఖలో 31వ సీఐఐ పార్టనర్?షిప్ సదస్సు జరగనుంది. దానికి ముందుగా అక్టోబర్?లో ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సులను నిర్వహించనున్నారు. అక్టోబర్ 7న ఐఐఎం విశాఖలోనూ, 12న జేఎన్టీయూ కాకినాడలో, 16న అంబేద్కర్ ఆడిటోరియంలో, 23న జేఎన్టీయూ అనంతపురంలో, 26న శ్రీసిటీ క్రియా యూనివర్సిటీ తిరుపతిలో ఇవి జరగనున్నాయి. ఈ మేరకు పార్టనర్?షిప్ సదస్సు 2026 సన్నాహక ఏర్పాట్లను

వివరాలు 2లో..

# 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ప్రాజెక్టులు

- జలధార పనుల పురోగతిపై పవన్ సమీక్ష
- అమరజీవి జలధార ద్వారా గోదావరి జిల్లాల్లో తాగునీటి కష్టాలకు చెక్
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తానన్న పవన్
- నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్‌జీవన్ పనుల వేగం పెంచాలి



**అమరావతి**

జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా గోదావరి జిల్లాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పనుల పురోగతిపై మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్‌జీవన్ పనుల వేగం పెంచాలని పవన్ సూచించారు. ఇన్‌టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణం వంటి కీలక పనుల పురోగతికి సంబంధించిన వివరాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడం పట్ల పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

# దేశంలోనే తొలిసారి 'ఏఐ' ఇంటర్వ్యూలు

-మొదటిపేజీ తరువాయి
ఉద్యోగాలకు సులువుగా ఎంపికయ్యేలా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించింది. నైపుణ్యం పోర్టల్‌లో నిర్వహించే ఒక్కో ఏఐ ఇంటర్వ్యూకు గరిష్ఠంగా 10 నిమిషాల సమయం ఉంటుంది. అభ్యర్థులు చదివిన సబ్జెక్టులు, ఎంచుకున్న రంగాలపైనే ఇందులో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఇచ్చే సమాధానాలను బట్టి ఏఐ వ్యవహరిస్తుంది. ప్రశ్నలకు వేగంగా సమాధానాలు ఇస్తుంటే, ప్రశ్నల సంఖ్య కూడా పెరుగుతుంది. ఒకవేళ అభ్యర్థి తడబడినా, సమాధానాలు చెప్పడంలో జాప్యం చేసినా తక్కువ ప్రశ్నలతోనే ఆ ఇంటర్వ్యూ ముగిసిపోతుంది. అంతేకాకుండా, ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థి అసలైన వ్యక్తా? లేక నకిలీనో? అనేది కూడా ఏఐ సులువుగా పట్టేస్తుంది. అభ్యర్థి వాయిస్ ద్వారా ఈ విషయాన్ని పక్కాగా గుర్తిస్తుంది. ఒక్కో అభ్యర్థికి రెండు ఏఐ ఇంటర్వ్యూలు ఇచ్చేలా పోర్టల్‌లో సదుపాయం కల్పించారు.

**ప్లంబర్ నుంచి బీటెక్ వరకు అందరికీ**

కేవలం ఉన్నత చదువులు చదివిన వారికే కాకుండా, వృత్తి నైపుణ్యాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఏఐ ఇంటర్వ్యూలు ఉపయోగపడనున్నాయి. ప్లంబర్, మెకానిక్ వంటి వృత్తుల దగ్గరి నుంచి బీటెక్ పూర్తి చేసిన, చదువుతున్న వారి వరకు అందరికీ ఇది లాభదాయకం. ఇందుకోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ 867 జాబ్ రోల్స్ (ఉద్యోగ విభాగాలు) ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇంటర్వ్యూ పూర్తయిన వెంటనే అభ్యర్థుల లాగిన్‌కు ఒక సర్టిఫికెట్ కూడా వస్తుంది.

**లోపాలు తెలుసుకోవచ్చు**

ఈ ఏఐ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులు తమ బలాలు, బలహీనతలను సులభంగా అంచనా వేసుకోవచ్చు. ఇంటర్వ్యూ పూర్తయ్యాక వచ్చే రిపోర్టులో అభ్యర్థి ఏ విభాగంలో వెనుకబడ్డారు? ఏ అంశంలో మెరుగ్గా ఉన్నారో స్పష్టంగా తెలుస్తుంది. ఒకవేళ ఏవైనా విభాగాల్లో వెనుకబడి ఉంటే ఆందోళన చెందాల్సిన పనిలేదు. అభ్యర్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ అదే వెబ్‌సైట్‌లో ఉచిత శిక్షణ పొందే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది.



**ఇక 50 లక్షల టార్గెట్**

ఈ ఏఐ ఇంటర్వ్యూలను నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేసి చూసింది. లక్ష ఏఐ ఇంటర్వ్యూలను నిర్వహించగా అద్భుతమైన స్పందన వచ్చింది. 81,874 మంది ఏఐ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 20,359 మంది ఉద్యోగులు, 7,520 మంది విద్యార్థులు, 53,995 మంది నిరుద్యోగులు ఉన్నారు. ఈ ప్రయోగంలో సానుకూల ఫలితాలు రావడంతో దీని పరిధిని భారీగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో 20 లక్షల ఏఐ ఇంటర్వ్యూల సదుపాయం కల్పించనున్నారు. ఆ తర్వాత రానున్న మూడేళ్ల కాలంలో 50 లక్షల ఏఐ ఇంటర్వ్యూలు నిర్వహించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

**ఇక్కడే రెజ్యూమె తయారీ**

నైపుణ్యం పోర్టల్ కేవలం ఇంటర్వ్యూలకే పరిమితం కాలేదు. ఇది ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికి ఒక చక్కని వేదికగా మారనుంది. అభ్యర్థులు తమ విద్యార్హతల ఆధారంగా ఇక్కడే ప్రొఫెషనల్‌గా రెజ్యూమె తయారు చేసుకోవచ్చు. దాన్ని ప్రింట్ కూడా తీసుకోవచ్చు. అలా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన రెజ్యూమెలు నేరుగా అందులో నమోదైన వివిధ కంపెనీలకు చేరుతాయి. అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూల్లో వారు సాధించిన ప్రతిభను చూసి కంపెనీలు నేరుగా ఆన్‌లైన్‌లోనే ఆఫర్స్ ఇచ్చే సదుపాయం ఇందులో ఉంది. ఆయా కంపెనీల నుంచి వచ్చే ఉద్యోగ సమాచారం నేరుగా అభ్యర్థుల లాగిన్‌కు, వారి వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ రూపంలో వెళ్తుంది.

# వేమండలో '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం'

**గన్నవరం :** ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ - కలవపాముల, తరిగొప్పల - మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, రూ.12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూళ్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

## 'పిల్ విలువైనది'

# మెగా డీఎస్సీపై సీబీఐ విచారణకు హైకోర్టు నిరాకరణ

మెగా డీఎస్సీ-2025 నియామకాలపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టులో విచారణ జరిగింది. డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈ పిల్ దాఖలు చేశారు. అయితే, ఈ పిల్‌పై జోక్యం చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. పిల్ వేసిన ఉద్దేశంపై న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

**బాధితులు నేరుగా ఎందుకు రాలేదు?**

మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా అమలు వల్ల పలువురు అభ్యర్థులు నష్టపోయారని, వారి తరఫున తాను ఈ పిల్ వేశానని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పోర్ట్స్ కోటా వల్ల నిజంగానే నష్టపోయిన అభ్యర్థులు ఎవరైనా ఉంటే, వారు నేరుగా కోర్టును ఆశ్రయించాలి కదా అని అడిగింది. వారు స్వయంగా కోర్టుకు ఎందుకు హాజరుకావడం లేదని ప్రశ్నించింది.

**ఆ వాదనతో ఏకీభవించలేం**

కోర్టు ప్రశ్నకు పిటిషనర్ తరఫు న్యాయవాది సమాధానం ఇస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేరుగా కోర్టును ఆశ్రయించేందుకు బాధిత అభ్యర్థులు భయపడుతున్నారని చెప్పారు. అందుకే వారి తరఫున ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్సీ ఈ పిల్ వేసినట్లు వివరించారు. ఈ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. బాధితులు కోర్టుకు రావడానికి భయపడుతున్నారనే వాదనతో తాము ఏకీభవించలేమని స్పష్టం చేసింది.

**ఇప్పటికే 335 పిటిషన్లు**

అభ్యర్థులు భయపడుతున్నారన్న వాదన సరికాదని చెప్పేందుకు న్యాయస్థానం ఓ ఉదాహరణ కూడా చెప్పింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, నియామక ప్రక్రియలను సవాల్ చేస్తూ వివిధ కారణాలతో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 335కు పైగా పిటిషన్లు దాఖలయ్యాయని కోర్టు గుర్తు చేసింది. అలాంటప్పుడు స్పోర్ట్స్ కోటా బాధితులు కూడా నేరుగా వచ్చి తమకు అన్యాయం జరిగిందని ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించింది.



**రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు**

ఈ సందర్భంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (పిల్) ఉద్దేశంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్ అనేది విలువైనదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే దాన్ని వినియోగించాలని హితవు పలికింది. రాజకీయ ప్రయోజనాల కోసం పిల్?ను వినియోగించడానికి అనుమతిస్తే దాని అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని కోర్టు వ్యాఖ్యానించింది. రాజకీయ ప్రయోజనాలతో కూడిన పిటిషన్లను ప్రోత్సహించలేమని పరోక్షంగా స్పష్టం చేసింది.

**వాదనలా? ఉపసంహరణా?**

కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో పిటిషనర్ తరఫు న్యాయవాదికి ధర్మాసనం ఓ సూచన చేసింది. ఈ పిల్‌పై తదుపరి వాదనలు కొనసాగిస్తారా? లేక పిటిషన్‌ను ఉపసంహరించుకుంటారా? అనేది పిటిషనర్ అయిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నుంచి స్పష్టమైన ఇన్ స్ట్రక్షన్స్ తీసుకుని తమ ముందుకు రావాలని న్యాయవాదికి సూచించింది.

## రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా

-మొదటిపేజీ తరువాయి
అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం పేర్కొన్నారు. 'సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే ప్రభుత్వానికి సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. దీనివల్ల 2.4 లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా పని చేస్తున్నాం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. మార్గదర్శి-బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనారిటీలకు పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించుకుంటున్నాయి.'
పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేదని, విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903 అని వివరించారు. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరామన్నారు. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గిందని, వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందని సీఎం వివరించారు.

**పొదుపు చేశాం**

వైఎస్సార్సీపీ పాలనలో నీతి ఆయోగ్ నివేదిక చూస్తే జరిగిన ఆర్థిక విధ్వంసం తేటతెల్లం అవుతోందని సీఎం అన్నారు. పెండింగ్ బిల్లులు రూ.48,616 కోట్లు ఉంటే దానిని రూ.29,259 కోట్లకు తగ్గించాగలిగామని సీఎం స్పష్టం చేశారు. 370లోన్లపై చర్చలు జరిపి 1100 కోట్లు ఆదా చెయ్యగలిగామని మెత్తంగా రూ. 8600 కోట్లు పొదుపు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఉండేవని సీఎం అన్నారు. ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయని, 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచిందని అన్నారు. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదని, కష్టపడి పనిచేస్తే ఫలితం పది రెట్లు ఉంటుందన్నారు. 2019 వైఎస్సార్సీపీ పాలనలో సంస్థలు రాలేదని వారి హయాంలో బ్రాండ్ ఆంధ్రా దెబ్బతిందని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటే షాక్‌కు గురయ్యామని ఎద్దేవా చేశారు.

## 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ప్రాజెక్టులు

-మొదటిపేజీ తరువాయి
ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు.
పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టామన్నారు. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పైప్?లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్?లో ఉంటే ఆ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ఆర్అండ్‌బీ, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పవన్ వెల్లడించారు. నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తామని తెలిపారు.

## రాష్ట్రంలో ఐదు చోట్ల సీఐఐ ప్రాంతీయ సదస్సులు

-మొదటిపేజీ తరువాయి
పర్యవేక్షించి, పురోగతి సమీక్షించేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్? అధ్యక్షతన, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేశ్?, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంఎస్ఎంఈ, ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సభ్యులుగా ఉన్నారు. ప్రోటోకాల్ రిసెప్షన్ వంటి వాటిని పర్యవేక్షణకు అధికార్లతో కమిటీ ఏర్పాటైంది. జీఏడీ (పోల్) ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా, కేంద్ర విదేశీ వ్యవహార సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ వీసీఎండీ, ఈడీబీ సీఈఓ, పరిశ్రమల డైరెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, టూరిజం వీసీఎండీ, వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్, చీఫ్ కమిషనర్ కస్టమ్స్, సీఐఐ ప్రతినిధులు ఇద్దరు సభ్యులుగా ఉన్నారు. దీనికి కన్వీనర్?గా విశాఖ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు.
సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ కమిటీ, సిటీ బ్యూటీఫికేషన్ కమిటీ, కల్చరల్ కమిటీ, మీడియా పబ్లిసిటీ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీలు ఆయా శాఖాధిపతులు, కార్యదర్శులు అధ్యక్షతన పనిచేయనున్నాయి. ఈ మేరకు ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

## షెల్ కంపెనీలను సృష్టించడంలో ఈశ్వర్ కీలక పాత్ర

సిట్ రిమాండ్ రిపోర్ట్‌లో కీలకాంశాలు
మద్యం కేసు నిందితుడు ఈశ్వర్‌ను విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టిన సిట్
నిందితుడికి ఈ నెల 18 వరకు రిమాండ్
గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని కోర్టు ఆదేశం

రాష్ట్రంలో 2019 నుంచి 2024 మధ్య కాలంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం డొంక కదులుతోంది. ప్రభుత్వ ఆదాయానికి వేల కోట్ల రూపాయల గండికొడుతూ సాగిన సిండికేట్ కుట్రను సిట్ అధికారులు బయటపెట్టారు. ఈ కేసులో తొమ్మిదో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్?కుమార్ రెడ్డిని సోమవారం నాడు శంషాబాద్ విమానాశ్రయంలో సిట్ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అతడిని ఇవాళ విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఈ నెల 18 వరకు రిమాండ్? విధించింది. ఈ సందర్భంగా నిందితుడి? రిమాండ్ రిపోర్ట్?లో సిట్ కీలక అంశాలను ప్రస్తావించింది. 2014-2019 మధ్యకాలంలో మద్యం ఆర్డర్ల కోసం అత్యంత పారదర్శకంగా అమలైన కంప్యూటర్ ఆధారిత 'ఆర్డర్ ఫర్ సప్లై' విధానాన్ని గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రద్దు చేసిందని సిట్ తెలిపింది. దానికి బదులుగా పాత మాన్యువల్ విధానాన్ని తెరపైకి తెచ్చి భారీ కుట్రకు తెరలేపారని పేర్కొంది. దీని ద్వారా ఏళ్ల తరబడి ప్రజలకు అలవాటైన, ప్రముఖ బ్రాండ్లను మార్కెట్ నుంచి మాయం చేశారని వివరించింది. కేవలం తమకు నచ్చిన, సిండికేట్‌కు అనుకూలమైన బ్రాండ్లకే ఆర్డర్లు ఇప్పించుకుని వేల కోట్లు కొల్లగొట్టారంటూ ఆధారాలను సమర్పించింది. వివిధ మద్యం డిస్టిలరీలు, కంపెనీల నుంచి నిందితులు దాదాపు రూ.3500 కోట్ల మేర ముడుపులు వసూలు చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని సిట్ వెల్లడించింది. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన ఈ వేల కోట్లను ఎన్నికల నిధులుగా దారి మళ్లించినట్లు చెప్పింది. తమ వ్యక్తిగత విలాసాలకు వాడుకోవడమే కాకుండా నల్లధనాన్ని వైట్ చేసుకునేందుకు షెల్ కంపెనీల స్థాపనకు మళ్లించినట్లు రిమాండ్ రిపోర్ట్?లో స్పష్టం చేసింది. ఈ భారీ స్కామ్‌లో సిండికేట్‌కు ఏ-9 ఈశ్వర్ కిరణ్?కుమార్ రెడ్డి ఆర్థిక వ్యూహకర్తగా, వెన్నెముకగా వ్యవహరించారని వివరించింది. కిక్ బ్యాక్‌ల సేకరణ, హవాలా మార్గాల ద్వారా నిధుల మళ్లింపు, నల్లధనాన్ని చట్టబద్ధం చేసేందుకు షెల్ కంపెనీలను సృష్టించడంలో ఇతడి పాత్ర అత్యంత కీలకమని వెల్లడించింది. మద్యం కిక్ బ్యాక్‌ల ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్మును దారి మళ్లించేందుకు నిందితులు పకడ్బందీ వ్యూహం రచించారని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలు, రియల్ ఎస్టేట్ రంగం, సినిమా నిర్మాణ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టారని తెలిపింది. ముఖ్యంగా దుబాయ్‌లో నిందితుడు ఈశ్వర్ భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టినట్లు సిట్‌కు పక్కా ఆధారాలు లభించాయి.

# అగ్రి ఫారెస్ట్రీ రైతులకు అండగా పీఎన్‌పీ సంస్థ

- 20 లక్షలకుపైగా మొక్కల రీప్లాంటేషన్ కార్యక్రమం
- మొక్కల మనుగడకు ప్రత్యేక చర్యలు చేపట్టిన పీఎన్‌పీ
- రైతుల పొలాలను పరిశీలించిన మండల బ్లాక్ ఇన్‌చార్జ్ గవ్వల మధు
- ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కల నాటకం
- మొక్కల సంరక్షణపై రైతులకు శాస్త్రీయ అవగాహన
- వెర్మీ కంపోస్ట్, కరాన్ ప్లస్,వ్యవసాయ పరికరాల పంపిణీ
- జీవవైవిధ్య పరిరక్షణ, నేల సారవంతతే పీఎన్‌పీ లక్ష్యం
- పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు స్థిరమైన జీవనోపాధే ధ్యేయం



**కనగానపల్లి,ఆగస్టు 4 (పెన్ సత్తా)** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అగ్రి ఫారెస్ట్రీ ప్రాజెక్టు ద్వారా రైతులకు అండగా నిలుస్తున్న పార్ట్‌నర్స్ ఇన్ ప్రాస్పెరిటీ (పీఎన్‌పీ) సంస్థ, రైతుల పొలాల్లో నాటిన 20 లక్షలకు పైగా మొక్కల సంరక్షణలో భాగంగా రీప్లాంటేషన్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టిందని పీఎన్‌పీ మండల బ్లాక్ ఇన్‌చార్జ్ గవ్వల మధు తెలిపారు. కనగానపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పొలాలను మంగళవారం సందర్శించిన ఆయన, నాటిన పండ్ల మొక్కల స్థితిగతులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొక్కల మనుగడను పెంచడం, ఆరోగ్యకరమైన ఎదుగుదలను నిర్ధారించడం, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని సాధించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.సంస్థ ఫీల్డ్ బృందాలు గ్రామాల్లో రైతులను నేరుగా కలుసుకుని మొక్కల పరిస్థితిని పరిశీలిస్తున్నాయని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో మొక్కల పెంపకం, సంరక్షణ,తేమ పరిరక్షణ,నీటి నిర్వహణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు.అలాగే రైతులకు వెర్మీ కంపోస్ట్,కరాన్ ప్లస్, వీడర్లు,స్ప్రేడ్లు వంటి వ్యవసాయ పరికరాలు, అవసరమైన ఇన్‌పుట్లను అందజేస్తూ మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదలకు సహకరిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణ, నేల సారవంతత పెంపు,వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయని గవ్వల మధు తెలిపారు.రైతుల భాగస్వామ్యంతో ప్రతి మొక్కను విజయవంతంగా పెంచి,పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే పీఎన్‌పీ సంస్థ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పీఎన్‌పీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం-సంక్షేమ విజయాలు,ప్రజా పాలన- ఇంటింటికి అభివృద్ధి.





**ప్రభుత్వ విప్ బెందాలం. అశోక్ బాబు**

**సోంపేట 4 (పెన్ సత్తా)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం--సంక్షేమ విజయాలు,ప్రజాపాలన-- ఇంటింటికీ అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ విప్ బెందాలం.అశోక్ బాబు సోంపేట మండలం లక్కవరం గ్రామాన్ని సందర్శించారు.

గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.లక్కవరం గ్రామానికి దశాబ్దాలుగా ఉన్న రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు.గ్రామానికి ఇరువైపులా రింగు రోడ్లతో కూడిన నూతన రహదారిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. మిగిలిన రహదారి పనులను కూడా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కంచిలి ఏఎంసి చైర్మన్ ప్రతినిధి మద్దిల నాగేష్, మాజీ జెడ్పీటీసీ చంద్రమోహన్,మాజీ ఎంపీపీ చిత్రాడ.శ్రీను, జుత్తు.పురుషోత్తం,బీన. ఆనంద్,ఈశ్వరరావు,ప్రదీప్, బతకల.జోగారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు, మహిళలుపాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లి హౌసింగ్ కాలనీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, (పెన్ సత్తా):**మంగళవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బ్రాహ్మణపల్లి హౌసింగ్ కాలనీని ఆకస్మికంగా సందర్శించారు.కాలనీలోని గృహ నిర్మాణ పురోగతిని పర్యవేక్షించిన ఆయన, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

లేఅవుట్ సమగ్ర వివరాలతో ఫార్మాట్ సిద్ధం చేయాలని సూచించారు.సందర్శనలో భాగంగా కలెక్టర్ లేఅవుట్ వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఆన్‌లైన్ డేటా ఆధారంగా బేస్‌మెంట్ లెవెల్ నుండి ఇల్లు పూర్తయ్యే స్థాయి వరకు ఉన్న గృహాల పూర్తి సమాచారాన్ని, లబ్ధిదారుల వివరాలను ఒక ప్రత్యేక ఫార్మాట్‌లో రూపొందించి తక్షణమే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆగిపోయిన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలివివిధ కారణాల వల్ల నిర్మాణం నిలిచిపోయిన ఇళ్లను గుర్తించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో



జిల్లా హౌసింగ్ అధికారి వెంకటనారాయణ , డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీఈఈ తహసీల్దార్ సంహిత , మున్సిపల్ అధికారులు మరియు హౌసింగ్ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జ్యోతుల మహోత్సవం



**పెనుకొండ, 4 (పెన్ సత్తా):**మున్సిపాలిటీ పరిధిలోని తోటగిరి వీధిలో నిర్వహించిన శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జ్యోతుల మహోత్సవం మహంకాళీ దేవాలయం నందు పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి రమణ , తెలుగుదేశం పార్టీ పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు , పెనుకొండ పట్టణ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ శ్రీరాములు , మహిళా అధ్యక్షురాలు రమణమ్మ మాజీ సర్పంచ్ అశ్వర్ధ నారాయణ , త్రివేంద్ర, బాబుల్ రెడ్డి,పులుగూర శ్రీనివాసులు, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, , రామలింగం, సోము, చంద్రకాంతమ్మ, జనసేన నాయకురాలు శ్రీదేవి, మల్లికార్జున, గోపికృష్ణ తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు.

# యాడికి మండల క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బత్తల ప్రసాద్ ఎన్నిక





**యాడికి , (పెన్ సత్తా)** :యాడికి మండల క్రిస్టియన్ అసోసియేషన్ వైఎంసిఏ 17వ కమిటీ ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో జరిగిన సమావేశంలో బత్తల ప్రసాద్ ను యాడికి మండల క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఆయన సతీమణి ఏమిమాను ఎన్నుకున్నారు. అదేవిధంగా వైస్ ప్రెసిడెంట్‌గా జాన్ సుధాకర్ అనిల్ జాషువా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది పాస్టర్లు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.ఎన్నికఅనంతరం నూతన కమిటీ సభ్యులు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు, నిరాశ్రయులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా బత్తల ప్రసాద్ మాట్లాడుతూ, యాడికి మండల క్రిస్టియన్ అసోసియేషన్ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతన కమిటీకి అందరూ కలిసి అభినందనలు తెలిపారు.

# ఎం. అగ్రహారం గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం

**అభివృద్ధి, సంక్షేమం... ధర్మవరం నియోజకవర్గానికి రెండు కళ్లలా పనిచేస్తున్నాం**

**ఇన్చార్జి హరీష్ బాబు**

**ధర్మవరం, (పెన్ సత్తా)** తాడిమర్రి మండలం ఎం. అగ్రహారం గ్రామంలో మంగళవారం పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఎం. అగ్రహారం రెవెన్యూ పరిధికి సంబంధించిన మొత్తం 1,630 పట్టాదార్ పాస్ పుస్తకాలలో తొలి విడతగా సుమారు 200 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తమ భూ హక్కులను అధికారికంగా గుర్తించి పాస్ పుస్తకాలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందన్నారు. రైతుల భూములకు సంబంధించిన హక్కులను పరిరక్షించడం, భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించడం, ప్రతి అర్హ రైతుకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం రైతుకు అత్యంత విలువైన పత్రం అని, భూమి యాజమాన్యానికి చట్టబద్ధమైన గుర్తింపుతో పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట రుణాలు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరితగతిన పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ధర్మవరం నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడుతున్నామని హరీష్ బాబు పేర్కొన్నారు. తాడిమర్రి మండలంలోని పుల్లఓబయ్యపల్లి--పిన్నదరి--పీఎన్ పల్లి మీదుగా తాడిమర్రి పుల్లంపల్లి వరకు 8.8 కిలోమీటర్ల బీటీ రహదారి పునర్నిర్మాణ పనులు రూ.3 కోట్లతో కొనసాగుతున్నాయని, అలాగే ధర్మవరం--తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి నర్పింపల్లి మీదుగా నిడిగల్లు వరకు 6.1 కిలోమీటర్ల బీటీ రహదారి పనులు రూ.2 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు.నిడిగల్లు నుంచి శివంపల్లి రీచ్-1, 2, 3, 4 వరకు 3 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాడిమర్రి మండలంలోని పిన్నదరి, శివంపల్లి గ్రామాల్లో ఒక్కో గ్రామానికి రూ.2.60 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.తహసిల్దార్ రెడ్డి లక్ష్మి డీటీ భాస్కర్ రెడ్డి, వీఆర్వో రామాంజి, బిజెపి మండల అధ్యక్షులు దేవర రాము, వన్నూరు రెడ్డి, ఆర్వేటి ఆనంద్, లక్ష్మీనారాయణ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

- ఆగస్టు 17 యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం
- జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ పిలుపు



**అనంతపురం, ఆగస్టు 4, (పెన్ సత్తా):**జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ డెబ్బై ఏళ్లుగా పోరాడుతూ వచ్చిందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎ.పి.యు. డబ్ల్యూ.జే.) అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం ప్రెస్ క్లబ్ లో జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్ట్ 17న యూనియన్ 70 వ ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆగస్ట్ 30 వ తేదీ లోపు జిల్లా యూనియన్ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని, ఆ తర్వాత జిల్లా మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో అనంతపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఆయూఫ్ మాట్లాడుతూ యూనియన్ సంస్థగతంగా బలోపేతం కావడానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టు సంక్షేమం హక్కుల సాధన కోసం ఏపీయూడబ్ల్యూజే 70 ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు యూనియన్ సభ్యులందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో ఐజేయూ సభ్యులు సనప రామకృష్ణ, ఐజేయు మాజీ సభ్యులు ప్రభాకర్ నాయుడు, మార్కండేయులు, జిల్లా ఉపాధ్యక్షులు లింగప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూలశెట్టి చలపతి, జిల్లా ట్రెజరర్ చౌడప్ప, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్రనాథ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భూమి రెడ్డి, బాల రంగారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేగాటి పల్లిలో నా పట్టు నా అభిమానం కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త డా.రమ్య



**ధర్మవరం, ఆగస్టు 4, (పెన్ సత్తా):**మండలంలోని రేగటిపల్లి గ్రామంలో నా పట్టు నా అభిమానం 2.0 కార్యక్రమం కింద మల్బరీలో సమగ్ర కీటక మరియు వ్యాధి నిర్వహణపై సాంకేతిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం, అనంతపురం శాస్త్రవేత్త డా. రమ్య వి.ఎస్ మల్బరీలో సంభవించే ప్రధాన కీటకాలు మరియు వ్యాధుల ఉత్పత్తి కారణాలు, వాటి ఆర్థిక ప్రాధాన్యం, శాస్త్రీయ నివారణ మరియు నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుతం రైతులు అధికంగా ఎదుర్కొంటున్న వేరు కుళ్లు వ్యాధి గురించి వివరించారు. వ్యాధి నివారణకు సరైన మొక్కల మధ్య దూరం స్పేసింగ్ పాటించడం నేల పీహెచ్ స్థాయిని పరీక్షించి తగిన విధంగా సరిచేయడంలిలి, అలాగే నేలలో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులను వినియోగించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వేరు కుళ్లు వ్యాధి సమగ్ర నిర్వహణపై క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. ఇందులో సాఫ్ 2 గ్రాములులీటరు నీటికి కలిపి మొక్కల అడుగు భాగంలో ద్రావణాన్ని పోయాలని, 10 రోజుల వ్యవధిలో రెండవసారి అదే విధంగా సాఫ్ ద్రావణాన్ని మళ్లీ వినియోగిం చాలని సూచించారు. అనంతరం మరో 10 రోజుల తర్వాత మూడవ విడతలో మిస్టర్ ప్రో 5 మి.లీ.లీటరు నీటికి కలిపి వ్యాధి సోకిన ప్రతి మొక్కకు 10 లీటర్ల ద్రావణం మరియు చుట్టుపక్కల ఆరోగ్యకరమైన ప్రతి మొక్కకు 5 లీటర్ల ద్రావణం నేలలో పోయాలని రైతులకు ప్రదర్శించి వివరించారు.ఈ కార్యక్రమంలోశ్రీ సత్యసాయి జిల్లా పట్టు శాఖ సంయుక్త సంచాలకురాలు శ్రీమతి శోభారాణి ధర్మవరం సహాయ సంచాలకురాలు రాజేశ్వరి దామోదర్ పట్టు అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు ఇతర శాఖ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పట్టు రైతులు పాల్గొని శాస్త్రవేత్తలు మరియు అధికారులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం దర్యాప్తు జరపాలి



- 6, 7, 8 తేదీల్లో రిలే దీక్షలు.. 9న భారీ ర్యాలీ
- రౌండ్ టేబుల్ సమావేశంలో వైసీపీ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి

**హిందూపురం, ఆగస్టు 4 (పెన్ సత్తా):**రాష్ట్రంలో నిర్వహించిన 2025 మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వైసీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన లక్షలాది నిరుద్యోగుల భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాట మాడిందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హిందూపురం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శివశంకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మెగా డీఎస్సీలో జరిగిన అక్రమాలు నిరుద్యోగులకు జరిగిన అన్యాయం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు, డీఎస్సీ అభ్యర్థులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు హాజరై డీఎస్సీ నియామక ప్రక్రియలో తలెత్తిన వివాదాలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ, మెగా డీఎస్సీని నిరుద్యోగులకు వరంగా ప్రకటించిన ప్రభుత్వం చివరకు అనుమానాలు, వివాదాలు, అభ్యంతరాలతో నింపిందన్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, అనంతరం తీసుకున్న నిర్ణయాలు అన్నీ అనేక సందేహాలకు తావిచ్చాయని విమర్శించారు. డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని, ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వతంత్ర దర్యాప్తు జరిపిస్తే అన్ని ఆధారాలను సమర్పించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. డీఎస్సీ పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రభుత్వం జీవో నెం.58 ద్వారా కొత్త నిబంధనలను తీసుకురావడం, అనంతరం జీవో నెం.47 ద్వారా వాటిని రద్దు చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఒకసారి తీసుకొచ్చిన నిర్ణయాలను కొద్ది రోజుల్లోనే మార్చడం ప్రభుత్వ వైఫల్యానికి, నియామక ప్రక్రియలో నెలకొన్న గందరగోళానికి నిదర్శనమని ఆరోపించారు. పారదర్శకతతో ఉద్యోగాలు భర్తీ చేయాల్సిన ప్రభుత్వం నిరుద్యోగులలో అనుమానాలు పెంచేలా వ్యవహరించిందన్నారు. వేలాది మంది అభ్యర్థులు ఏళ్ల తరబడి కష్టపడి పరీక్షలకు సిద్ధమై, ఉద్యోగాలపై ఆశలు పెట్టుకుంటే ప్రభుత్వం వారి భవిష్యత్తును సందిగ్ధంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు 9వ తేదీన భారీ నిరసన ర్యాలీ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి లోకేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, కురుబ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, నాయకులు శ్రీకాంత్ గౌడ్, మండల కన్వీనర్లు రాము, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోవాలో హిందూపురం రోటరీకి అవార్డుల పంట

-రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ స్థాయిలో పలు విభాగాల్లో ప్రతిభకు గుర్తింపు



**హిందూపురం, ఆగస్టు 4, (పెన్ సత్తా)**రోటరీ క్లబ్ గోవాలో మంగళవారం నిర్వహించిన రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ కార్యక్రమంలో స్థానిక హిందూపురం రోటరీ క్లబ్ పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకుని మరోసారి తన సేవా కార్యక్రమాల ప్రతిష్ఠను చాటుకుంది. సమాజ సేవ, విద్య, ప్రజా అవగాహన, వృత్తి సేవలు తదితర రంగాల్లో క్లబ్ చేపట్టిన విశిష్ట కార్యక్రమాలను గుర్తించిన రోటరీ ఇంటర్నేషనల్ ఈ అవార్డులను ప్రకటించింది. హిందూపురం రోటరీ క్లబ్‌కు బెస్ట్ కమ్యూనిటీ సర్వీసెస్ అవార్డ్, బెస్ట్ పబ్లిక్ ఇమేజ్ అవార్డ్, బెస్ట్ ఒకేషనల్ సర్వీసెస్ అవార్డ్, బెస్ట్ క్లబ్ అవార్డ్, బెస్ట్ ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ అవార్డ్, ఆల్ కాంట్రిబ్యూటర్స్ అవార్డుల లభించాయి. అదేవిధంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నంబూరి సుమంత్ కు బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మాజీ రోటరీ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, మాజీ కార్యదర్శి శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ, తమ సేవా కార్యక్రమాలను గుర్తించి రోటరీ ఇంటర్నేషనల్ ప్రతిష్ఠాత్మక అవార్డులతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి సహకరించిన క్లబ్ సభ్యులందరికీ వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ సేవా కార్యక్రమాల నిర్వహణలో ఎప్పటికప్పుడు సహకారం అందించిన హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన మీడియా ప్రతినిధులు, పాత్రికేయులకు కూడా కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ అవార్డులతో హిందూపురం రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో మరింత గుర్తింపు లభించిందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం పాల్గొన్న అబ్జర్వర్ రాయల్ నరసింహ రావు



**గోరంట్ల, ఆగస్టు 4, (పెన్ సత్తా)**రాష్ట్ర మంత్రి వర్యులు సవితమ్మ ఆదేశాల మేరకుబూత్ నెంబర్ 238 రెడ్డివారి వీధిలోరెండేళ్ల నమ్మకం... ప్రతి ఇంటి అభివృద్ధికి అంకితం కార్యక్రమం లో పెనుకొండ నియోజక వర్గం అబ్జర్వర్ రాయల్ నరసింహారావు, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగే పల్లి రమణ, మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మంత్రి వర్యులు సవితమ్మ ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే "ఇంటి-ఇంటికీ తెలుగుదేశం" కార్యక్రమం కు శ్రీకారం చుట్టారు, గోరంట్ల టౌన్ లోని రెడ్డివారివీధి 238 లలో నిర్వహించారు. బూత్ నెంబర్ లలో కుటుంబాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి, మై టీడీపీ యాప్ ద్వారా వివరాలను నమోదుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వివరించారు,మండలములో జరుగుతున్న అభివృద్ధి , రోడ్లు, బాలికల హాస్టల్, బాలుర హాస్టలు,త్వరలో అన్నా క్యాంటీన్, త్వరలో త్రాగునీటి ఎద్దడి పరిష్కారం, కోసం మంత్రి సవితమ్మ గారు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు,ఈ కార్యక్రమంలో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, క్లస్టర్ ఇంచార్జి లు, బూత్ కన్వీనర్లు, డీలర్లు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భోగాపురంపై ఉన్న శ్రద్ధ దొనకొండపై ఎందుకు లేదు?

- కైపు వెంకట కృష్ణా రెడ్డి




(పెన్ సత్తా)భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించడం హర్షణీయమని, అయితే దానిని చూపిస్తూ ఉత్తరాంధ్ర మొత్తం అభివృద్ధి అయిపోయినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలు చెప్పడం మానుకోవాలని రాష్ట్ర అసంఘటిత కార్మికులు మరియు ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకట కృష్ణా రెడ్డి అన్నారు.

దొనకొండ విమానాశ్రయం ప్రభుత్వాలకు కనిపించడం లేదా?

భోగాపురం విమానాశ్రయంపై చూపుతున్న శ్రద్ధ రాష్ట్రానికి నడిబొడ్డున, దర్శి నియోజకవర్గానికి మరో మణిహారంగా ఉన్న చారిత్రక దొనకొండ విమానాశ్రయంపై ఎందుకు చూపడం లేదని కైపు వెంకట కృష్ణా రెడ్డి ప్రశ్నించారు.దొనకొండ విమానాశ్రయాన్ని పునరుద్ధరించి అభివృద్ధి చేస్తే దర్శి నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లా, పరిసర ప్రాంతాలకు పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.దొనకొండ విమానాశ్రయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, విమాన సేవల పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ప్రత్యేక కరువు ప్యాకేజీ ఇవ్వాలి

దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను ప్రభుత్వం వెంటనే గుర్తించి వాటిని కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్షాభావం, సాగునీటి కొరతతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఐదు మండలాలకు ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం, వ్యవసాయ కూలీలకు ఉపాధి, తాగునీరు--సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు.

# సీఐ రాజగోపాల్ నాయుడును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ

**సోమందేపల్లి, ఆగస్టు 4, (పెన్ సత్తా):**శ్రీ సత్య సాయి జిల్లా,హిందూపురం పట్టణంలో గత సోమవారం రాత్రి మాతృశ్రీ హాస్పిటల్ నందు వైద్యం వికటించి ఒక గర్భిణీ మహిళ మృతి చెందిన సమయంలో మాతృ శ్రీ హాస్పిటల్ వైద్యులు ఉద్దేశ పూర్వకముగా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా అక్కడికి వెళ్లిన బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ మీద హిందూపురం వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు బూట్ల కాళ్లతో దాడి చేయడం, బ్రోకర్ వా అంటూ రాయలేని భాషలో తిట్టడం జరిగినది.అందుకు నిరసనగా సోమందేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు "సీఐ రాజగోపాల్ నాయుడు నీ సస్పెండ్ చేయాలని, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని,తక్షణం వీధుల నుండి విఆర్ కి పంపాలని" నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టడం జరిగినది.అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద దండోరా దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక నాయకులు పెద్దన్న,సూర్యనారాయణ,నరసింహమూర్తి తదితర నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజులలో చేసే నిరసనను పోరాటాలలో మేమందరం పార్టీలకతీతంగా ప్రత్యక్షంగా పాల్గొని న్యాయం జరిగేంత వరకు ఈ పోరాటంలో ఉంటామని తెలియజేయడం జరిగింది.ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామ్యవాదిగా ఎలాంటి స్వార్థం లేకుండా నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం,ప్రజల సమస్యల పైన పోరాడుతున్న ఒక దళిత బడుగు బలహీన వర్గాల న్యాయవాదిగా మరియు బహుజన నాయకుడు అయిన శివరామకృష్ణ మీద దాడి చేయడాన్ని మేము అందరం పూర్తిగా ఖండిస్తున్నాం.దీనిని మేము ఒక శివరామకృష్ణ మీద జరిగిన దాడి గా చూడటం లేదు,మొత్తం దళిత వర్గం మీద జరిగిన దాడిగా మేము భావిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమములో దళిత దండోరా బహుజన సంఘాల ఐక్య వేదిక నాయకులు కిష్టప్ప, సూర్య నారాయణ,పెద్దన్న,హనుమయ్య, నరసింహ మూర్తి, కంబాలప్ప, చాలాకూరు హనుమంతు, గంగరాం, నాగరాజు, సజ్జరాయప్ప, ఏ.బి.ఆంజనేయులు,రంగేపల్లి కదిరప్ప కొల్లప్ప,పెయింటర్ రామాంజి నేయులు,




వరలక్ష్మి,వెంకటేష్,రామాంజి,రామకృష్ణ,సంతోష,మంచెపల్లిమల్లికార్జున,అమర్, సంతోష్,చల్లపల్లి ఈశ్వర్, రంగేపల్లినాగరాజు,సి.యన్.రామాంజినేయులు,యం.కె.అంజినప్ప,కోలా టఅంజినప్ప,కే.పి.నరసింహులు,బెల్దర్ నరసింహులు, రామాంజినేయులు,తదితరాలు పాల్గొన్నారు

# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**-- సాకే వీరాంజనేయులు, సాకే గోవిందు పిలుపు**



ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా నలుమూలల గిరిజన సోదర సోదరీమణులకు తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, ఏకలవ్య ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవిందు, డివిఎంసి సభ్యులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు ని కలిసి కార్యక్రమ నిర్వహణపై చర్చించి, జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ప్రధాన అంశాలపై చర్చించడంతో పాటు, ప్రభుత్వం నుంచి గిరిజనులకు రావాల్సిన సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని, జీవో నెం. 52ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. అలాగే గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన హక్కుల సాధన కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు.కావున, అనంతపురం అర్బన్‌లోని పాతూరు గిరిజన భవనంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి జిల్లా నలుమూలల గిరిజన సోదర సోదరీమణులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డైరెక్టర్ రమేష్ నాయక్, మనోహర్, జిల్లా ఎరుకల సంఘం గౌరవ సలహాదారులు పెనుగొండ చంద్రయ్య, పెనుగొండ బాబయ్య, పెనుగొండ శివ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అనుబంధ కమిటీల నియామక ప్రక్రియపై బద్వేల్ ఇంచార్జితో వై.ఎస్ జబీవుల్లా చర్చ



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ కమిటీల నియామక ప్రక్రియకు సంబంధించి జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వై.ఎస్. జబీవుల్లా మంగళవారం బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జి సూర్యనారాయణ రెడ్డి గారిని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అనుబంధ కమిటీల నియామకాలను త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేసే అంశంపై ఇరువురు నాయకులు సమీక్షించారు. పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ, అధిష్ఠానం మార్గదర్శకాల మేరకు నియామక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అలాగే పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకలాపాల విస్తరణ, నాయకులు--కార్యకర్తల సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

## చండీపురా వైరస్‌తో 22 మంది చిన్నారుల మృతి

గుజరాత్‌లో చండీపురా వైరస్ వ్యాప్తి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటి వరకు 22 మంది చిన్నారులు మృతి చెందారు. మరో ఏడుగురు చిన్నారులు ఐసీయూలో చికిత్స పొందుతుండగా, 35 మందికి వైరస్ నిర్ధారణైంది. శాండ్ ఫ్లై అనే చిన్న ఈగ ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తున్నట్లు వైద్య అధికారులు వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ చేపడుతున్నారు. చిన్నారుల్లో జ్వరం, నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పెళ్లైన నెలకే పాము కాటుతో నవవరుడు మృతి

**పత్తికొండ** సంబరాల్లో మునిగితేలాల్సిన ఆ ఇంట్లో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకుంది. నూరేళ్ల పంటగా భావించి వేసిన తాళి ముడి వేసి నెల రోజులు కూడా కాక ముందే పాము కాటుకు గురై నవవరుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకెళ్తే స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హోసూర్ గ్రామానికి చెందిన మాలరవి దేవనకొండకు చెందిన లక్ష్మీతో నెల కిందట ఎంతో వైభవంగా వివాహం జరిగింది. ఇరు కుటుంబాల్లోనూ పండుగ వాతావరణం నెలకొంది.జరిగిందని కుటుంబీకులు తెలిపారు. అయితే ఆషాడం కావడంతో పుట్టింటికి వెళ్లిన భార్యను చూసేందుకు రెండు రోజుల కిందట దేవనకొండకు వెళ్లాడు. నిద్రిస్తుండగా.. పాము కాటేయడంతో మరణించాడని కుటుంబీకులు తెలిపారు..కుటుంబంలో నిండిన శోకసంద్రం: కళ్లెదుటే కొత్తగా పెళ్లైన భర్త ప్రాణాలు కోల్పోవడంతో నవవధువు రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. "నెల రోజులైనా నిండకముందే నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయావా" అని ఆమె విలపిస్తున్న తీరు చూసి గ్రామస్తులు తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**బేతంచెర్ల** : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,పేర్కొన్నారు.బేతంచెర్ల పట్టణంలో మంగళవారం ఇంటింటికి తేదేపా కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి హనుమాన్ నగర్,సంజీవ నగర్, కాలనీలలోఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.అలాగే మండల పరిధిలోని పసాసాని కోటల,తవిసి కొండ,హుస్సేన పురం, గ్రామలలోఎమ్మెల్యే ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి,మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య,బుగ్గన ప్రభాకర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ అంజి,టైలర్ రాముడు,మాజీ ఎంపీపి సోమశేఖర్ రెడ్డి, బండికటి వెంకటేశ్వర రెడ్డి,ఉన్నాం సుధాకర్, బీమేశ్వర రెడ్డి,గోపాల్,మద్దయ్య,బిజెపి జిల్లా కార్యదర్శి నాగమోహన్,ఎర్రమల,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.2,000 దాటిన యూపీఐ పేమెంట్లపై చార్జీలు.. కొత్త చట్టంపై కసరత్తు చేస్తున్న కేంద్రం

దేశంలో ప్రస్తుతం యూపీఐ సేవల వినియోగం పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు యూపీఐ సేవలన్నీ ఉచితమే. కానీ, ఇకపై ఈ విధానంలో మార్పు వచ్చే అవకాశం ఉంది. యూపీఐ సేవలపై స్వల్ప ఫీజు వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికోసం చట్టంలో మార్పులు తీసుకురానుంది. యూపీఐ పేమెంట్స్‌కు సంబంధించి అమలులో ఉన్న పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్‌కు పార్లమెంట్‌లో సవరణలు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ సవరణ చట్టం అమలులోకి వస్తే యూపీఐ లావాదేవీలపై పరిమితమైన ఛార్జీలు విధిస్తారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఛార్జీలు విధించడం లేదు. కొత్త చట్టం ద్వారా పేమెంట్ ఇండస్ట్రీ వర్గాల ఎప్పటినుంచో కోరుతున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలు చేస్తారు.

## తొట్టిగారిపల్లె పిహెచ్‌సిలో ఆశా సమావేశం

### తల్లిపాల వారోత్సవాలు, నవజాత సంరక్షణపై అవగాహన



బద్వేల్ మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. మెడికల్ ఆఫీసర్ డా. జి.రాజేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. నవజాత శిశు సంరక్షణలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను ప్రతి లబ్ధిదారునికి అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను పరిశీలించి ఏమైనా లోపాలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. గర్భిణులు, చిన్నపిల్లల సంరక్షణ బాధ్యత ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందిపై ఉందని తెలిపారు. గ్రామాల్లో అన్ని ఆరోగ్య పథకాలను లబ్ధిదారులకు చేరవేయాలని, చంద్రన్న చికిత్స, 108, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంక్రమణ వ్యాధుల సర్వే, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా ప్రతి బిడ్డకు స్క్రీనింగ్ చేసి మెరుగైన వైద్యం అందించాలన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.వెంగయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ కె.చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ సులోచి, హెల్త్ అసిస్టెంట్ వి.జనార్దన్ రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## పాఠశాల అభివృద్ధికి చేయూత

**- లో ఓల్టేజ్ కారణంగా ఫేజ్ మీటర్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం**

**- రూ.12 వేలు అందజేసిన 1990 - 91 బ్యాచ్**



:జి సిగడాం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి 1990 - 91 బ్యాచ్ చేయూతనందించారు. ఈ విషయం తెలిసిన ఆ బ్యాచ్ తమ వంతు సహకరంగా రూ. 12 వేల రూపాయలను ప్రధాన ఉపాధ్యాయులు పి శ్రీనివాస రావు కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రతీ పూర్వ విద్యార్థి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రధాన ఉపాధ్యాయులు ,పాఠశాల సిబ్బంది 1990 - 91 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవా భావాన్ని అభినందిస్తూ ,వారి సహకారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# బీఎల్‌ఏ-2లకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి

**ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన**

**యువ మోర్చా, మహిళా మోర్చా మండల అధ్యక్షుల నియామక ప్రకటన**



నెల్లిపాకలో బీజేపీ నిర్వహించిన బీఎల్ఏ-2 దిశానిర్దేశ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ స్వప్న కుమారి



నెల్లిపాకలో బీజేపీ నిర్వహించిన బీఎల్ఏ-2 దిశానిర్దేశ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ స్వప్న కుమారి, జిల్లా అధ్యక్షుడు ఈక బుల్లికొండలు దొర, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎటపాక మండల అధ్యక్షుడు నలజాల శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన నెల్లిపాక గ్రామంలోని భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఏ-2లకు దిశానిర్దేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఈక బుల్లికొండలు దొర, రాష్ట్ర కార్యదర్శి మరియు బీఎల్‌ఏ-1 శ్రీరామ్ స్వప్న కుమారి హాజరై బూత్ స్థాయి ఏజెంట్లకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్ బాధ్యత అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలను వివరించి, ఫారం-6, ఫారం-7, ఫారం-8ల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి బీఎల్‌ఏ తన పరిధిలోని ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సవరణలను సక్రమంగా చేపట్టాలని సూచించారు. అనంతరం యువ మోర్చా మండల అధ్యక్షుడిగా మలోత్ సాయికుమార్‌ను, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా జుట్టి నాగమణిని జిల్లా అధ్యక్షుడు ఈక బుల్లికొండలు దొర సమక్షంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నోముల రామారావు, యువ మోర్చా నాయకుడు మూడే సతీష్‌కుమార్ నాయక్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షురాలు గంధం జయమ్మ, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి రవికుమార్ (గాంధీ), మండల ప్రధాన కార్యదర్శి పెనుబల్లి ప్రసాద్, మండల కార్యదర్శి కుంజ రమేష్, మండల ఉపాధ్యక్షులు నాంపల్లి రమేష్, బొల్లా ప్రసాద్, ఇసంపల్లి శ్రీనివాస్, కుంజ అంజిబాబు, కుంజ నాగరాజు, షేక్ షాబీర్, ఎస్. రాంబాబు, కొర్సా రామకృష్ణ, గద్దల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో తాగునీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం: మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి



గొల్లప్రోలు పట్టణ ప్రజలకు ముందస్తు అలర్ట్. పట్టణంలో తాగునీటి సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణ ప్రవేశంలోని సూర్యుడు చెరువు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎల్ఎస్ఆర్ ట్యాంకు పనుల నేపథ్యంలో, అక్కడ ఉన్న తాగునీటి ప్రధాన పైప్‌లైన్‌ను వేరే చోటికి షిఫ్ట్ చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ అత్యవసర పనుల కారణంగానే నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు.

**ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలి**

పైప్‌లైన్ మార్పిడి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇవి పూర్తయ్యే వరకు పట్టణ ప్రజలు సహనంతో మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు. పనులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను యథావిధిగా పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ఈ లోపు పట్టణ ప్రజలు తమ అవసరాలకు సరిపడా తాగునీటిని ముందస్తుగానే నిల్వ చేసుకోవాలని కమిషనర్ దివిజ సంపతి తెలిపారు.

# 41.15 కాంటూరు నిర్వాసితులకు న్యాయం చేయాలి

**-- కలెక్టర్‌కు ఆదివాసీ నాయకుల వినతి**

**18 ఏళ్లు నిండిన యువతకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్**



పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలో ఉన్న బూజ్జిరాయిగూడెం గ్రామ నిర్వాసితులకు పునరావాసం, మౌలిక వసతులు కల్పించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ( ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ వర్తింపజేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పోలవరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.మంగళవారం పోలవరం వరద ముంపు ప్రాంతాల పరిశీలన కోసం బూజ్జిరాయిగూడెం గ్రామానికి వచ్చిన జిల్లా కలెక్టర్, చింతూరు ప్రాజెక్టు అధికారి ( పి ఓ ), కూనవరం తహసీల్దార్, పోలీసు అధికారులను గ్రామస్తులు కలిసి కలిశారు. గ్రామం 41.15 కాంటూరు పరిధిలో ఉన్నందున గ్రామాన్ని ఎప్పుడు పూర్తిగా తరలిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం నిర్వాసితుల సమస్యలు, డిమాండ్లను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు సోడే సుమన్ మాట్లాడుతూ, 2016 నాటి కటాఫ్ ( పి ఎన్ ) తేదీ కారణంగా గత పదేళ్లలో 18 సంవత్సరాలు నిండిన అనేక మంది యువతీ యువకులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని వదిలి వెళ్లకుండా ఇక్కడే జీవిస్తున్న కుటుంబాల్లో ఇప్పటికే 10 నుంచి 15 మంది యువతీ యువకులు వివాహాలు చేసుకుని కొత్త కుటుంబాలుగా స్థిరపడ్డారని తెలిపారు. వారందరినీ ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే రాయణపేటలో పునరావాస ఇళ్లు నిర్మించి, వ్యవసాయ భూములను చదును చేసి అందించాలని, జీవనోపాధి కోసం మేకల పంపిణీ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పునరావాస ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మోసం హరీష్, పూల కిషోర్, నానుపల్లి వెంకటేశ్వర్లు, హరిబాబు, జెల్లీ రవి తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హుస్సేనాపురంలో వైసీపీకి భారీ షాక్.. 22 కుటుంబాలు టీడీపీలో చేరిక



బేతంచెర్ల మండలం హుస్సేనాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన 22 కుటుంబాలు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమం మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షత న నిర్వహించారు.అలాగే గ్రామ టీడీపీ నాయకుడు బండికాటి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.పార్టీలో చేరిన వారిలో బండికాటి రామేశ్వర్ రెడ్డి, బండికాటి వెంకటకృష్ణారెడ్డి, బండికాటి ఆదిలక్ష్మి, ఈశ్వర్ రెడ్డి, స్వామి రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శేఖర్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, బోయిన నారాయణ, నాగన్న, సుబ్బరాయుడు, రంగస్వామి, కమ్మరి బ్రహ్మయ్యచారి, పాల బ్రహ్మయ్యచారి, బోయిని పెద్ద రంగస్వామి, బోయిని నడిపి రంగడు, మెట్ల నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్ర లింగమూర్తి, చిన్న రంగడు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, కర్నూలు అడ్వకేట్స్ భాస్కర్ రెడ్డి ,కృష్ణ వర్ధన్ రెడ్డి, పి.ఎ వెంకట్ రెడ్డి, రాజశేఖర్ , టిడిపి నాయకులు భీమేశ్వర్ రెడ్డి , తిరుమలేష్ చౌదరి , 10 వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు, ఉన్నం సుధాకర్, మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగమోహన్, బిజెపి నాయకుడు రమేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

పెన్ సత్తా
బుధవారం 5 ఆగస్టు 2026

### సంపాదకీయం


## భయం వీడాలి!

జమ్మూ కశ్మీర్‌లో శాంతి ఎంత పెళుసుగా ఉందో మరోసారి రుజువైంది. జూలై 31న సాయంత్రం కుల్గాంలోని కేలం ప్రాంతంలో ఒక ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న చత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీపక్ అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన భూపేందర్ కుమార్‌ను అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. ఈ దాడికి కేవలం రెండు రోజుల ముందు, పొరుగునే ఉన్న అనంతనాగ్‌లో ఐఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఆషిక్ హుస్సేన్ ఖురేషీని "షూట్ అండ్ స్కూట్" పద్ధతిలో దుండగులు కాల్చి చంపిన ఘటన కశ్మీర్‌ను కలవరపెట్టింది. ఈ దాడి వెనుక లష్కరే తొయిబాకు చెందిన ఒంటరి ఉగ్రవాది హస్తం ఉండొచ్చన్నది పోలీసుల అనుమానం. అయితే దీని ప్రభావం అంతకుమించి విస్తరించింది -పాత భయాలు మళ్లీ తలెత్తాయి, ప్రజా విశ్వాసం కుంగిపోయింది, అత్యంత బలహీనవర్గాలే లక్ష్యంగా మారాయి. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ దాడిని "పిరికిపంద చర్య"గా అభివర్ణిస్తూ ఖండించారు, ఉగ్రవాదులను తుదముట్టించాలని భద్రతా బలగాలను ఆదేశించారు. వలస కార్మికుల నమోదు తప్పనిసరి చేయడం, యాజమాన్యాల ద్వారా బీమా సదుపాయం కల్పించడం, బాధితులకు గౌరవప్రదమైన అంత్యక్రియలు జరిపించడం వంటి చర్యలు అవసరమైనవే. అయితే, కేవలం బలప్రయోగంతోనే శాశ్వత శాంతిని సాధించలేమని కశ్మీర్ ఇటీవలి చరిత్రే చెబుతోంది.

లోయలో నిర్మాణ రంగం, ఉద్యానవన పరిశ్రమ, ఇటుక బట్టీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు -వీటన్నింటినీ నడిపిస్తున్నది వలస కార్మికులే. వేల కిలోమీటర్ల దూరంనుంచి కొద్దిపాటి వేతనం కోసం వచ్చే వీరు, తగినంత రక్షణ లేకుండా సులభమైన లక్ష్యాలుగా మిగిలిపోతున్నారు. వీరిపై దాడులు కేవలం క్రూరత్వ చర్యలు మాత్రమే కాదు -సాధారణ పరిస్థితులను చెడగొట్టి, భయాన్ని నాటి, మత సామరస్యాన్ని ఛిద్రం చేసేందుకు పథకం ప్రకారం జరిగే యత్నాలు! 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత వలస కార్మికులపై ఇలాంటి దాడులు పలుమార్లు జరిగాయి, ఆనాటినుంచి భయం, అభద్రతా భావం వారిని వెన్నాడుతూనే ఉన్నాయి. తాజా దాడుల నేపథ్యంలో భారీ భద్రతా స్పందన కనిపించింది. కార్డన్-అండ్-సెర్చ్ ఆపరేషన్లు, అదనపు బలగాల మోహరింపు, ఉగ్రవాద నిరోధక వ్యవస్థను మరింత పటిష్టం చేయడం వంటివి చేపట్టారు. ఈ బుధవారం.. ఆగస్టు 5న, జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కేంద్రం రద్దు చేసి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించి ఏడేళ్లు పూర్తవుతుంది. రాజకీయంగా సున్నితమైన తరుణంలో.. పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణకు నేషనల్ కాన్ఫరెన్స్ తన డిమాండ్‌ను మరింత తీవ్రతరం చేసింది. ఇది లోయ అంతటా విస్తృతంగా వ్యక్తమవుతున్న ఆకాంక్షే. ఈ నేపథ్యంలోనే, కుల్గాం, అనంతనాగ్ దాడుల "సమయం"పై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా లేవనెత్తిన ప్రశ్నలు వివాదాస్పదమయ్యాయి. రాష్ట్ర హోదా వంటి రాజకీయ డిమాండ్లు ఊపందుకున్నప్పుడల్లా లక్షిత హత్యలు పెరుగుతాయని ఆయన వాదన. నిష్పక్షపాత దర్యాప్తు జరపాలన్న లెఫ్టినెంట్ గవర్నర్ పిలుపు సబబైనదే, తొందరపాటు నిర్ధారణలకు రావొద్దన్న ఆయన హెచ్చరిక కూడా వివేకవంతమైనదే. అయితే, ఉగ్రదాడుల చుట్టూ ఏ పక్షం నుంచి వచ్చే రాజకీయ ఊహాగానాలైనా, ధ్రువీకరణను మరింత తీవ్రతరం చేసి, ప్రాణాలను కాపాడాల్సిన తక్షణ కర్తవ్యం నుంచి దృష్టి మరల్చే ప్రమాదం ఉంది.

పోలీసింగ్, శాంతిభద్రతలపై నియంత్రణ కేంద్రం వద్దే ఉంచుకుంటూ, ఢిల్లీ తరహా నమూనాలో రాష్ట్ర హోదా పునరుద్ధరించే యోచనలో కేంద్రం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే ఈ ప్రతిపాదనను నేషనల్ కాన్ఫరెన్స్ తిరస్కరిస్తోంది. ఏ నమూనా అమలైనా, అనంతనాగ్, కుల్గాం దాడులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోకూడదు. ఎన్నికైన నాయకులను బలహీనపరిచేందుకో, ప్రజాస్వామిక డిమాండ్లను తుంగలో తొక్కేందుకో ఉగ్రదాడులను రాజకీయం చేయకూడదు. అదే సమయంలో, సామూహిక అరెస్టులు, కూల్చివేతలు, విచక్షణారహిత నిర్బంధాలవంటి చర్యలు సమాజాలను దూరం చేసి, విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి కాబట్టి అధికారులు కూడా వాటికి దూరంగా ఉండాలి. శాశ్వత శాంతికి లక్షిత ఉగ్రవాద నిరోధక చర్యలతోపాటు, సమాజ అనుకూల పోలీసింగ్ అవసరం. వలస కార్మికులకు సురక్షిత వసతి, రవాణా సదుపాయాలు, తక్షణ స్పందన బృందాలు, సంబంధిత అధికారుల నియామకం చేయాలి. దర్యాప్తులు వేగంగా, పారదర్శకంగా, తప్పుడు సమాచార ప్రచారానికి తావివ్వకుండా జరగాలి. రాజకీయ నాయకులు హింసను ముక్తకంఠంతో ఖండించాలి, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి, విషాదాన్ని సొంత ప్రయోజనాలకు వాడుకోవడం మానుకోవాలి. జమ్మూ కశ్మీర్ ఈరోజు ఒక కీలక మలుపులో నిలిచి ఉంది. రాజ్యాంగపరమైన మార్పులు దాని రాజకీయ ముఖచిత్రాన్ని మార్చాయే తప్ప, ప్రజల ఆకాంక్షలను చెరిపేయలేకపోయాయి. అర్థవంతమైన రాష్ట్ర హోదా పునరుద్ధరణ, ఎన్నికైన సంస్థలకు అధికారం కల్పించడం, పరిపాలనా-భద్రతా బాధ్యతలను స్పష్టం చేయడం -విశ్వాసాన్ని పునర్నిర్మించేందుకు ఇవి తప్పనిసరి. కేవలం రాష్ట్ర హోదా ఒక్కటే శాంతిని తీసుకురాలేదు. స్థానికులు, వలస కార్మికులు భయం లేకుండా జీవించగలగడం, పర్యాటకులు సురక్షితంగా భావించడం, భద్రతా సిబ్బంది ఉగ్రదాడుల నుంచి రక్షితంగా ఉండటం -ఇవన్నీ కలిస్తేనే నిజమైన శాంతి సాధ్యమవుతుంది. కశ్మీర్ లోయ హింస, రాజకీయ దోపిడీ నుంచి బయటపడాలి. రాష్ట్ర హోదా ఏరూపంలో వచ్చినా, కశ్మీర్‌కు అవసరమైనది సమ్మిళిత రాజకీయాలు, పటిష్టమైన భద్రత, ఐక్యత మాత్రమే. హంతకులకు న్యాయస్థానంలో శిక్ష పడాలి, ప్రజలను కరుణతో, దూరదృష్టితో కాపాడాలి. ఏడేళ్ల తర్వాత కూడా కశ్మీర్ ప్రజలు ఎదుర్కొంటున్న అభద్రతా భావం, పాలనలో పరిష్కారం కావాల్సిన ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయని ఈ దాడులు గుర్తుచేస్తున్నాయి. రాజకీయ చర్చలు ఎంత తీవ్రంగా సాగినా, సామాన్య ప్రజల భద్రతను త్యాగం చేయకూడదు. ప్రతి వలస కార్మికుడి ప్రాణం, ప్రతి భద్రతా సిబ్బంది ప్రాణం దేశానికి సమానంగా విలువైనదని పాలకులు గుర్తుంచుకోవాలి. కశ్మీర్‌లో శాశ్వత శాంతి సాధించాలంటే, భద్రతా బలగాలు, పౌర సమాజం, రాజకీయ పక్షాలు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. భయం స్థానంలో విశ్వాసం నెలకొన్నప్పుడే, లోయలో నిజమైన అభివృద్ధి, సామరస్యం సాధ్యమవుతాయి.

### పనికొచ్చే పలుకు




## వర్తమానమే.. అసలు జీవితం!

ఓవర్‌థింకింగ్ అంటే వాస్తవం కాని ఒక కల్పిత కథను మనసులో అల్లుకోవడమే. "ఇలా జరిగితే ఎలా? అలా విఫలమైతే ఏంటి?" అనే ప్రశ్నలు మనసులో మాత్రమే పుట్టేవి, వాస్తవానికి అవి ఇంకా జరగనేలేదు. అయినా, ఈ ఊహాజనిత భయాలు మన శరీరంలో నిజమైన ఒత్తిడిని సృష్టిస్తాయి. గుండె వేగంగా కొట్టుకుంటుంది, నిద్ర దూరమవుతుంది, మనసు అల్లకల్లోలంగా మారుతుంది -అంతా ఒక ఊహ కోసం మాత్రమే! ఇది ఆధునిక జీవనశైలిలో అత్యంత సాధారణమైన మానసిక ఉచ్చు. చిన్న విషయాన్ని పదే పదే మననం చేసుకుంటూ, దానికి కొత్త కొత్త కోణాలు, ఊహించని పర్యవసానాలు జోడిస్తూ, అసలు సమస్య కంటే మన ఆలోచనల భారమే మనల్ని అలసిపోయేలా చేస్తుంది.

మనిషి మనసు సహజంగా రెండు దిక్కులవైపు పరుగెడుతుంటుంది -గతం వైపు, భవిష్యత్తు వైపు. గతం గురించి ఆలోచిస్తే పశ్చాత్తాపం, అపరాధ భావన మిగులుతాయి; భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఆందోళన, భయం చుట్టుముడతాయి. కానీ వర్తమానం మాత్రమే మనం నిజంగా జీవించగలిగే క్షణం. ఈ క్షణంలో ఏం జరుగుతుందో దానిపైనే మన నియంత్రణ ఉంటుంది. గతాన్ని మార్చలేం, భవిష్యత్తును ముందుగానే నిర్ణయించలేం. అందుకే ఆలోచనలు గతం లేదా భవిష్యత్తువైపు పరుగెత్తినప్పుడల్లా, ఊపిరి తీసుకుంటూ, చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచాన్ని గమనిస్తూ, మనల్ని మనం బలవంతంగానైనా వర్తమానానికి తీసుకురావాలి. ఇది ఒక్కసారితో అయ్యే పని కాదు, నిత్యం అభ్యసించాల్సిన మానసిక క్రమశిక్షణ. ఈ అలవాటు మనిషి జీవనశైలిని సమూలంగా మార్చగలదు. నిర్ణయాలు తీసుకోవడంలో స్పష్టత పెరుగుతుంది, ఎందుకంటే భయం నుంచి కాకుండా వాస్తవం నుంచి ఆలోచించడం మొదలవుతుంది. సంబంధాల్లో నిజాయితీ పెరుగుతుంది, ఎందుకంటే అనవసర అనుమానాలు, ఊహాజనిత అపార్థాలు తగ్గిపోతాయి. పని విషయంలో ఉత్పాదకత మెరుగుపడుతుంది. ఎందుకంటే శక్తినంతా ఆలోచనల్లో వృథా చేయకుండా, చేతిలో ఉన్న పనిపై కేంద్రీకరించగలుగుతారు. అంతేకాదు, శారీరక ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం పడుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి తగ్గడం వల్ల రక్తపోటు, నిద్రలేమివంటి సమస్యలు కూడా క్రమేణా తగ్గుముఖం పడతాయి. చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోవడం మానేసినప్పుడు, జీవితం తేలికగా, ఆనందదాయకంగా అనిపిస్తుంది.

ప్రఖ్యాత రచయిత మార్క్ ట్వేన్ చెప్పిన మాటలు ఈ సందర్భంలో గుర్తుచేసుకోదగినవి. "నా జీవితంలో ఎదుర్కొన్న చాలా భయాలు, వాస్తవానికి ఎప్పుడూ నిజం కాలేదు" అని ఆయన ఒక సందర్భంలో పేర్కొన్నారు. అంటే మనం భయపడే విషయాల్లో అత్యధిక శాతం కేవలం మన ఊహల్లోనే మిగిలిపోతాయి తప్ప, వాస్తవంలో సంభవించవు. ఇదే భావాన్ని పురాతన తెలుగు నీతి పద్యాలు కూడా ప్రతిబింబిస్తాయి -"జరిగినది మార్చలేము. జరగనిది తెలియదు. జరుగుతున్నదే జీవితం" అనే భావన శతకకారుల బోధనల్లో పలుమార్లు కనిపిస్తుంది. వర్తమానంలో నిలబడి, ప్రశాంతంగా జీవించడమే నిజమైన జ్ఞానమని పెద్దలు చెప్పిన మాట నేటికీ వర్తిస్తుంది.

కాబట్టి, మనసు గతం వైపో భవిష్యత్తు వైపో పరుగెత్తినప్పుడల్లా, ఒక్క క్షణం ఆగి, "ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నాను, ఏం చేస్తున్నాను" అని తనను తాను ప్రశ్నించుకోవడం అలవాటు చేసుకోవాలి. ఇది చిన్న అలవాటే అయినా, దీర్ఘకాలంలో మనశ్శాంతిని, స్పష్టతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచే శక్తివంతమైన సాధనంగా మారుతుంది. ఓవర్‌థింకింగ్ అనే ఊహాజనిత కథను వదిలేసి, వర్తమానమనే వాస్తవ జీవితాన్ని స్వీకరించడమే నిజమైన మానసిక ఆరోగ్యానికి తొలి అడుగు.

-మహాదేవ


# చదువుల చెద.. గిట్టెదెప్పుడు!



భారత విద్యా వ్యవస్థ గాడి తప్పిందని చెప్పక తప్పదు. ప్రశ్నాపత్రాల లీకేజీలు కఠిన శిక్షలతో ఆగేవి కావు. నిజంగా అవసరమైనది భావజాల పక్షపాతానికి తావు లేకుండా వ్యవస్థను సమూలంగా సంస్కరించడమే. పేపర్ లీకేజీలు భారత్‌లో ఏటా జరిగే ఒక పరిపాటి అంశమైంది; ప్రభుత్వ దశాబ్దాల నిర్లక్ష్యానికి, ప్రజా పరీక్షల నిర్వహణలో అవగాహనారాహిత్యానికి బాధితులు ప్రతిచోటా కనిపిస్తున్నారు. బిహార్‌లో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్ష గందరగోళానికి గురైనప్పుడు, బాధిత యువత రైలు బోగీలకు నిప్పంటించారు, పట్టాలను దిగ్బంధించారు, రాళ్లు రువ్వారు. కేవలం 35 వేల ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు. నెలకు రూ.20 వేల ప్రారంభ వేతనంతో శాశ్వత ఉద్యోగం దక్కించుకునేందుకు. బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, తెలంగాణల్లో యువత సాయుధ బలగాల నియామకంలో నిబంధనలు మార్చిన "అగ్నిపథ్" పథకంపై ఆగ్రహావేశాలతో వీధుల్లోకి వచ్చారు. ఇదంతా మోదీ ప్రభుత్వానికి తెలియదని అనుకోలేం. అయితే, పేపర్ లీకేజీలకు పరిష్కారం చిన్న దళారులపై కఠినమైన శిక్షలు విధించడంలో లేదు. వారెప్పుడూ దొరికిపోయే చిన్న చేపలే! పేపర్ లీకేజీ వ్యాపారం భారీస్థాయిలో సాగుతోంది, హీనపక్షం రూ.1,000 కోట్ల విలువైన వ్యాపారం. ఇంతటి భారీ వ్యాపారానికి రూ.10 కోట్ల జరిమానా అనేది కేవలం చిల్లర ఖర్చే.. సులభంగా భరించగలిగేదే!

అసలు సమస్య "వ్యవస్థ"లోనే ఉంది; ప్రతీకాత్మక చర్యలతో పరిష్కారం లభించదు. ప్రజా పరీక్షల సందర్భంలో విద్య -అది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల కోసమైనా, లేదా దేశంలో అత్యంత భద్రమైన ఉద్యోగాలైన ప్రభుత్వ ఉద్యోగాల నియామకం కోసమైనా -ఒక తీవ్రమైన పోటీగా మారిపోయింది. "పరీక్ష క్రాక్" చేయడం కోసం సాగే ఈ హోరాహోరీ పోరు విద్యను ఒక వాణిజ్య వస్తువుగా మార్చేసింది. దీని ఫలితంగా, విజయం సాధించాలన్న డిమాండ్‌ను తీర్చేందుకు లీకైన ప్రశ్నాపత్రాల సరఫరా వ్యవస్థతో కూడిన ఒక మార్కెట్టే ఏర్పడింది. జాతీయ విద్యా విధానం, చరిత్ర-సైన్స్ పాఠ్యాంశాల్లో మార్పులు, పాత సంస్థలను కూల్చివేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీవంటి పూర్తిగా విశ్వసనీయత లేని కొత్త వ్యవస్థలను తీసుకురావడం -ఇవన్నీ విద్యార్థులను ఆశ్చర్యానికి గురిచేస్తూ లీకేజీలకు కారణమవుతూ, పరీక్షల మాఫియాకు లాభాలు తెచ్చిపెడుతూనే ఉన్నాయి. ఇవి సమస్యను మరింత దుర్గంధభరితం చేస్తున్నాయే తప్ప, పరిష్కారాలు కావు. మధ్యాహ్న భోజన మెనూలో సాత్విక ఆహారం వర్సెస్ మాంసాహారం వంటి చర్చలు కూడా, పాఠశాలల్లో ప్రభుత్వం అందించే భోజనం అసలు లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమవుతున్నాయి. మార్చాల్సినదేమిటో విద్యార్థులకు తెలుసు, విద్యావేత్తలు, నిపుణులకూ తెలుసు -తెలియనిది ప్రభుత్వానికి మాత్రమేనని స్పష్టమవుతోంది. తల్లిదండ్రుల మాదిరిగా వ్యవహరించే రాజకీయ వర్గం ఎంత దయనీయంగా ఉందంటే, జెన్-జెడ్, జెన్-ఆల్ఫా తరాలు తమ కోసం తామే నిలబడాలని గ్రహిస్తున్నాయి -లేకుంటే ఏఐ గురించి మాట్లాడే రాజకీయ నాయకత్వం, ఏఐ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా యువతను సన్నద్ధం చేయడంలో మాత్రం విఫలమవుతూ, వారిని బస్సు కింద తోసేస్తుంది. 15-29 వయసుగల 30.7 కోట్లమంది యువత శ్రామిక మార్కెట్‌లోకి ప్రవేశించగా, 14.1 కోట్ల మంది మాత్రమే శ్రామిక శక్తిలో ఉన్నారు; 12.7 కోట్ల మంది "ఉపాధి" పొందినట్టు కనిపించినా, కేవలం ఎనిమిదో వంతు మందికి మాత్రమే -అంటే 1.5 కోట్లమందికి మాత్రమే ఒప్పంద ఆధారిత, సామాజిక భద్రతతో కూడిన, గౌరవప్రదమైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనం, కెరీర్ అవకాశాలున్న శాశ్వత జీతభత్యాల ఉద్యోగాలు దక్కుతున్నాయి. మరోలా చెప్పాలంటే, యువతలో నాలుగో వంతు (25.7 శాతం) కుటుంబ పనుల్లో ఉచితంగా శ్రమిస్తున్నారు, 21.3 శాతం "సొంత ఖాతా పని"లో నిమగ్నమై ఉండగా, 22 శాతం తాత్కాలిక పనుల్లో, 18 శాతం సామాజిక భద్రత లేని క్రమబద్ధ ఉద్యోగాల్లో ఉన్నారు, కేవలం 11.8 శాతంమందికి మాత్రమే సామాజిక భద్రతతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి.

వైద్యం, ఇంజినీరింగ్, న్యాయవాద, అకౌంటెన్సీ వంటి రంగాల్లో డిగ్రీలు -విద్యార్థులు, వారి కుటుంబాలు మెరుగైన జీవన నాణ్యత కోసం చేసే పెట్టుబడులు. అయితే, ఈ పెట్టుబడికి ఎలాంటి హామీ లేదని ఆ కుటుంబాలకూ తెలుసు. అర్హత సాధించిన యువత తమ పెట్టుబడికి తగిన ఉద్యోగాలు దక్కించుకోకపోవచ్చు. ఏఐ సాంకేతికతలను స్వీకరించి, వాటికి అనుగుణంగా మారగలిగే ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించే సంస్కరణలు విద్యా రంగానికి కావాలి, వేద గణితం తరహా భావజాల సంస్కరణలు కాదు. ప్రైవేటు పెట్టుబడులను లాభదాయక మార్గంగా ప్రోత్సహించడం కాకుండా, ఏఐ సాంకేతికతలతో మారుతున్న శ్రామిక శక్తిలో చేరగలిగే యువతను తీర్చిదిద్దేందుకు భారీ ప్రభుత్వ పెట్టుబడులు అవసరం. ఆకాంక్షలకు, అవకాశాలకు మధ్య అంతరాన్ని గుర్తించాలి -తగిన వేతనంతో కూడిన పని అవకాశాల తీవ్ర కొరత కారణంగా, ప్రతిభావంతులైన యువత తీవ్రమైన నిరాశకు గురవుతున్నారు. నీట్ ప్రక్రియ అనర్హులుగా భావించే వారిని మినహాయించే ఒక పరీక్ష -ప్రతిభతో సంబంధం లేకుండా, పరీక్షకు హాజరైన వ్యక్తి, కుటుంబం కలలను ధ్వంసం చేయగల ఒక అనిశ్చిత సంఘటన. ఉద్యోగ నియామక పరీక్షలు కూడా అర్హులను మిగిలిన వారినుంచి వేరు చేసే ఒక పద్ధతే. రెండు సందర్భాల్లోనూ, వైద్య కళాశాలల్లో సీట్లు, ప్రభుత్వ శాశ్వత ఉద్యోగాల సంఖ్య అభ్యర్థుల సంఖ్యతో పోలిస్తే తీవ్రంగా అసమతుల్యంగా ఉంది. 35 వేల తక్కువ వేతన, భవిష్యత్తులేని ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా అభ్యర్థులు పోటీపడుతున్నారు. విద్య, ఆరోగ్యంలో పెట్టుబడి పెట్టనంత కాలం భారత్ "వికసిత్ భారత్" లక్ష్యాన్ని త్వరలో సాధించలేదన్నది వాస్తవం. చైనా ఈ పెట్టుబడిని 1950ల్లోనే ప్రారంభించింది; భారత్ చేస్తున్నామని చెప్పుకున్నా, ఆచరణలో విఫలమైంది. 15 ఏళ్లలోపు పిల్లలకు మాత్రమే విద్యను ప్రాథమిక హక్కుగా చేయడానికి 2009 వరకు పట్టింది. తరగతి గదులు డిజిటల్‌గా మారుతున్నాయని, ఏఐ ఆధారిత అభ్యాసం అందుబాటులోకి వస్తుందని ఎంత గొప్పగా చెప్పుకున్నా, విద్యా వ్యవస్థ ఇప్పటికీ నిరాశాజనకంగానే మిగిలిపోయింది; ఉపాధ్యాయుల సామర్థ్యం, పరీక్షలు, పాఠ్యాంశాలు కాలం చెల్లినవిగానే ఉన్నాయని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులే స్వయంగా చెప్పారు. రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అర్హత ప్రమాణాలు, తదనంతర హింసాత్మక నిరసనల చరిత్ర గతంలోనూ పలుమార్లు కనిపించింది. పీహెచ్‌డీ చేసిన నిరుద్యోగ యువత కూడా, కేవలం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత అవసరమైన పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాల కోసం పరీక్షలు రాయాల్సిన దుస్థితి నెలకొంది. కఠిన చట్టాన్ని తీసుకురావడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు; హామీలను నెరవేర్చేందుకు అవసరమైన లోతైన అవగాహన, నిబద్ధత లేకపోతే, ఎంతటి కఠిన శిక్షలు అమలు చేసినా భారత విద్యా వ్యవస్థ కుళ్లు తొలగదు! ■



బంధంలో ఇచ్చిపుచ్చుకోవడాలు బేరీజు వేసుకుంటే, ప్రేమ వ్యాపారంగా మారిపోతుంది. నిజమైన సహచర్యం ఉండాలంటే, "నాకేం దక్కింది" అనే ఆలోచన నుంచి "నేనేం అందించగలను" అనే దృక్పథానికి మారాలి. జీవిత భాగస్వామి కోరికలను, అవసరాలను మన స్వంతం కంటే ముందు పెట్టినప్పుడే, ఆ బంధంలో నిజమైన బలం చిగురిస్తుంది. "నేను ఇంత త్యాగం చేశాను, మరి నువ్వేం చేశావు" అనే లెక్కలు మొదలైతే, ప్రేమ స్థానంలో పోటీతత్వం చోటుచేసుకుంటుంది. అవతలి వ్యక్తి కళ్లలో మెరుపు చూడాలన్న తపననే మన కర్తవ్యంగా భావించినప్పుడు, ఆ చిరునవ్వు మనకు రెట్టింపు ఆనందాన్నిస్తుంది. ఇచ్చే గుణమే బంధాన్ని జీవితాంతం నిలబెడుతుంది, తీసుకోవాలనే ఆరాటం కాదు.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## నెలవరకూ ఉతకక్కర్లేదట!



ఒక నెల రోజులు వరకూ ఉతకాల్సిన అవసరం లేని టీ-షర్టును అమెరికన్ దుస్తుల సంస్థ 'హర్క్‌లియాన్' తయారు చేసింది. గతంలో స్వీయ-శుభ్రతగల లోదుస్తులతో వైరలైన ఈ కంపెనీ, తాజాగా 'హర్క్‌షర్ట్ వి5.0' పేరుతో ఐదో వెర్షన్ టీ-షర్టును విడుదల చేసింది. వేసవిలో ఎంత చెమటపట్టినా, నెల రోజులపాటు ధరించినా దుర్వాసన రాదని కంపెనీ చెబుతోంది. దీని వెనుక రహస్యం -రాగి, వెండి, జింక్, బంగారం, అగ్నిపర్వత బూడిద సహా ఏడు ప్రత్యేక పదార్థాలను దుస్తు ఉపరితలంపై కాకుండా, నేతలోనే కలిపి తయారు చేయడం. రాగి బ్యాక్టీరియాను అడ్డుకుంటే, జింక్ చెమట వాసనను తటస్థీకరిస్తుంది, అగ్నిపర్వత బూడిద తేమను శోషించుకుంటుంది. ధర 79 డాలర్లు అయినా, ఏడు సాధారణ టీ-షర్టులకు సమానమని కంపెనీ వాదన. నవంబర్‌లో మార్కెట్లోకి రానున్న ఈ షర్టు తొలుత నలుపు రంగులోనే లభించనుంది.

# గాయాలతో బుమ్రా సతమతం..
# గాబరా పడుతున్న టీమ్ఇండియా

జస్ప్రీత్ బుమ్రా.. ఈ పేసర్ బరిలోకి దిగుతున్నాడంటే ప్రత్యర్థి జట్ల బ్యాటర్ల గుండెల్లో గుబులు పుడుతుంది. స్వింగర్లు, యార్కర్లతో హడలెత్తించే పేస్ గుర్రాన్ని ఎదుర్కొవడానికి స్టార్ బ్యాటర్లు కూడా ఇబ్బందిపడతారు. ఇంతటి నాణ్యమైన బౌలర్ కీలకమైన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండట్లేదు. అందుకు కారణం అతను వరుసగా గాయాల బారినపడటం. ఈ ఏడాది ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా (దీబఎతీఖుప్త).. టీ20 ప్రపంచ కప్ ముగిశాక టీ20ల్లోనూ బరిలోకి దిగలేదు. ఐపీఎల్ తర్వాత నెలన్నరపాటు మైదానానికి దూరంగా ఉన్న అతను.. గత నెలలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌తో పునరాగమనం చేశాడు. అక్కడ రెండు మ్యాచ్‌లు ఆడి గాయం కారణంగా మూడో మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. 2016 జనవరిలో అరంగేట్రం చేసిన బుమ్రా ఇప్పటివరకు గాయం, ఫిట్‌నెస్ సమస్యలతో ఏయే మ్యాచ్‌లు, సిరీస్‌లకు దూరమయ్యాడో ఓ లుక్కేద్దాం.

2022 జులైలో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో వెన్నెముక గాయానికి గురైన జస్ప్రీత్ ఆ తర్వాత యూఏఈలో జరిగిన ఆసియా కప్‌నకు దూరమయ్యాడు.




ఆసియా కప్‌నకు దూరమైన బుమ్రా అదే ఏడాది సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగిన సిరీస్‌తో తిరిగి జట్టులోకి వచ్చాడు. అయితే, మళ్లీ వెన్నునొప్పి సమస్య తలెత్తడంతో 11 నెలలపాటు క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ స్టార్ పేసర్ అందుబాటులో లేని లోటు 2022 టీ20 ప్రపంచ కప్‌లో స్పష్టంగా కనిపించింది. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో 2022/23 బోర్డర్–గావస్కర్ ట్రోఫీ, తర్వాత జరిగిన ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అదే ఏడాది ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అందుబాటులో లేడు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 209 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. 2024–25 బోర్డర్–గావస్కర్ ట్రోఫీ ఐదో టెస్టులో బౌలింగ్ చేస్తున్నప్పుడు బుమ్రా గాయపడ్డాడు. ఆ గాయం నుంచి కోలుకుంటున్న తరుణంలో 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. కానీ, నడుము కింది భాగంలో గాయమవడంతో టోర్నీకి దూరమయ్యాడు.

ఇప్పుడు మోకాలి గాయం నుంచి అతడు ఇంకా కోలుకోకపోవడంతో శ్రీలంక పర్యటనకు దూరమవుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్, ఆ తర్వాత టీ20 ప్రపంచకప్, ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లు ఉన్నాయి. కాబట్టి.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) బుమ్రా ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం, గాయాల నుంచి కోలుకునే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది.

## ద్రవిడ్‌లాగే రహానేకు ఎప్పుడూ గుర్తింపు దక్కలేదు: సునీల్ గవాస్కర్

**ఇంటర్నెట్ డెస్క్:** ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు దక్కాల్సిన గుర్తింపు ఎప్పుడూ దక్కలేదని దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. "కెప్టెన్‌గా రహానేకు అద్భుతమైన రికార్డు ఉంది. అతను ఆరు టెస్టులకు సారథ్యం వహించగా.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ అద్భుతమైన విజయాలు నమోదైనప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు లభించలేదు. అలాగే రహానే (ూాయఅఅనిఖ తీుప్తుఖఅవ) నాయకత్వానికి కూడా పెద్దగా ప్రశంసలు దక్కలేదు. భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన బ్యాటర్లు లేదా బౌలర్లకే ప్రశంసలు దక్కుతాయి. కానీ జట్టు ఓడిపోయినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లే నిందలు మోయాల్సి వస్తుంది. గాయాలతో బుమ్రా సతమతం.. గాబరా పడుతున్న టీమ్ఇండియా




2021 ఆస్ట్రేలియా పర్యటనలో మొదటి టెస్టులో టీమ్ఇండియా కేవలం 36 పరుగులకే కుప్పకూలి తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. తదుపరి మ్యాచ్‌ల్లో కోచ్ రవిశాస్త్రితో కలిసి జట్టును ఆ పరిస్థితి నుంచి మెరుగైన స్థితికి చేర్చింది రహానేనే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి గెలుపుబాట పట్టించాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు అపూర్వమైన విజయాన్ని అందించడమే కాకుండా సిరీస్‌నూ సాధించిపె ట్టాడు. నిజానికి ఆ సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు అగ్రశ్రేణి ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేరు. అయినప్పటికీ భారత్ తన టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప విజయాన్ని అందుకుంది. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## తొమ్మిదో సీడ్‌గా సింధు
## సాత్విక్ జోడీకి ఐదో సీడ్



**ఢిల్లీ:** సొంతగడ్డపై బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగమ్మాయి పీవీ సింధు తొమ్మిదో సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఈనెల 17 నుంచి ఢిల్లీ వేదికగా జరుగబోయే ఈ టోర్నీ కోసం మంగళవారం నిర్వహించిన డ్రాలో షట్లర్లకు సీడింగ్స్ కేటాయించారు. భారత డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి ఐదో సీడ్ దక్కగా మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్‌కు 14వ, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్–తనీషా 15వ సీడ్ దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ చాంప్ షి యుకీ (చైనా), విమెన్స్ సింగిల్స్‌లో అన్ సె యాంగ్ (దక్షిణ కొరియా) టాప్ సీడ్స్‌గా పోటీపడనున్నారు.

## పాక్‌కు ఆధిక్యం

ట్రినిడాడ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ దీటుగా బదులిస్తోంది. రెండో రోజే మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు.. మంగళవారం అదే జోరును కొనసాగించి ఆధిక్యంలోకి వచ్చింది. ఓవర్ నైట్ స్కోరు 266/2తో ఆట కొనసాగించిన పాక్.. కడపటి వార్తలు అందే సమయానికి 381/7 స్కోరు చేసింది. రెండో రోజే శతకం బాదిన అబ్దుల్ షఫీక్ (158 బ్యాటింగ్) భారీ స్కోరు దిశగా అడుగులు వేస్తుండగా బాబర్ ఆజమ్ (88) మరోసారి సెంచరీ ముంగిట విఫలమయ్యాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 344 పరుగులకు ఆలౌటైంది.




# పాత్ర కోసం ఎంతకైనా: 'పెద్ది' కోసం చరణ్- మహావతార్ కోసం విక్కీ

పూనమ్ బజ్వా ఫ్యాషన్‌కి నిప్పు పెడుతోంది







భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటులు ఎంతోమంది ఉన్నా.. ఎంచుకున్న పాత్ర కోసం నెలల తరబడి శ్రమిస్తూ తమ శరీరాకృతిని సైతం మార్చుకునే నటులు చాలా అరుదుగా ఉంటారు.భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటులు ఎంతోమంది ఉన్నా.. ఎంచుకున్న పాత్ర కోసం నెలల తరబడి శ్రమిస్తూ తమ శరీరాకృతిని సైతం మార్చుకునే నటులు చాలా అరుదుగా ఉంటారు. టాలీవుడ్‌లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్... బాలీవుడ్‌లో టాలెంటెడ్ హీరో విక్కీ కౌశల్ ఈ తరహా అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తారు. ఇరు పరిశ్రమల్లో ఎంతో కష్టపడే స్వభావం ఉన్న ఈ ఇద్దరు హీరోలు.. నిజ జీవితంలో మంచి స్నేహితులు కూడా కావడం విశేషం. ఇటీవల ఈ ఇద్దరూ తాము నటించే పాన్–ఇండియా సినిమాల కోసం తీవ్రంగా శ్రమించడం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది.దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన –పెద్ది– చిత్రం కోసం రామ్ చరణ్ ఎంతగా కష్టపడ్డారో కళ్లారా చూసాం. చరణ్ అహోరాత్రులు శ్రమించి వెయిట్ గెయిన్ అయి సరికొత్త లుక్‌లోకి మారారు. పాత్రలో స్వాభావికత కోసం, గ్రామీణ స్పోర్ట్స్ డ్రామాకి తగ్గట్టుగా చరణ్ తన శరీరాకృతిని మలుచుకున్నారు. మరోవైపు బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ కూడా తన తదుపరి పౌరాణిక చిత్రం –మహావతార్– కోసం దాదాపు 25 కేజీలకు పైగా బరువు పెరగడానికి సిద్ధమవుతున్నారు. –పెద్ది– చిత్రం కోసం రామ్ చరణ్ పడిన కష్టాన్ని తలపించేలా ఇప్పుడు విక్కీ కౌశల్ కూడా అదే స్థాయిలో శ్రమిస్తుండటం గమనార్హం.–మహావతార్– సినిమాలో విక్కీ కౌశల్ అత్యంత పరాక్రమవంతుడైన విష్ణుమూర్తి అవతారం –పరశురాముడి– పాత్రలో కనిపించనున్నారు. పురాణాల్లో పరశురాముడిని విల్లు, గొడ్డలి (పరశువు) చేతబట్టిన శక్తిమంతుడిగా, అమరత్వంతో కూడిన మహోన్నత వ్యక్తిగా వర్ణించారు. ఆ దివ్యమైన, బలిష్టమైన రూపానికి న్యాయం చేసేందుకే విక్కీ ఈ భారీ మేకోవర్‌కు శ్రీకారం చుడుతున్నారు. గతంలో –ఛావా– సినిమాలోని ఛత్రపతి శంభాజీ మహారాజ్ పాత్ర కోసం తన బరువును 80 కేజీల నుండి 105 కేజీలకు పెంచిన విక్కీ.. ఈ సారి పరశు రాముడి పాత్ర కోసం అంతకుమించి బలిష్టంగా మారేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ భారీ రూపాంతరం కోసం విక్కీ కౌశల్ మరోసారి తన పాత ఫిట్‌నెస్ కోచ్ తేజస్ లల్వానీతో జతకట్టారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే మొదలయ్యే ఈ శిక్షణలో భాగంగా స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, బెంచ్ ప్రెస్ వంటి కాంపౌండ్ ఎక్సర్‌సైజులపై దృష్టి సారించనున్నారు. అలాగే న్యూట్రిషనిస్ట్ ఆల్కేష్ శరోత్రీ పర్యవేక్షణలో రోజూవారీ క్యాలరీల వినియోగాన్ని 250 నుండి 500 క్యాలరీల వరకు పెంచి.. ప్రోటీన్లు, పొడిపప్పులు, డైరీ ఉత్పత్తులతో కూడిన ప్రత్యేక డైట్ తీసుకోనున్నారు. కండరాల రికవరీ కోసం రోజుకు 8 గంటల నిద్ర – ప్రతి మజిల్ గ్రూప్‌కు 48 గంటల విశ్రాంతిని కేటాయించనున్నారు.

చిత్ర పరిశ్రమలో సాంకేతికత ఎంత పెరిగినా ఒక నటుడు పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడానికి పడే కష్టమే ఆ సినిమాను విజయతీరాలకు చేరుస్తుంది. టాలీవుడ్‌లో –పెద్ది– చిత్రం కోసం రామ్ చరణ్ చూపించిన డెడికేషన్, బాలీవుడ్‌లో –మహావతార్– కోసం విక్కీ కౌశల్ పడుతున్న శ్రమ సినిమాపై వారికున్న ఫ్యాషన్ ని తెలియజేస్తోంది.

రామ్ చరణ్, విక్కీ కౌశల్ వంటి అంకితభావం ఉన్న నటులు.. రెండు వేర్వేరు చిత్ర పరిశ్రమల్లో భారతదేశపు గొప్ప కథలను వెండితెరపై ఆవిష్కరించేందుకు పడుతున్న ఈ తపన నిజంగా ప్రశంసనీయం.

సోనమ్ బజ్వా దీవెనలలో నివసిస్తున్నారు



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com